క్లుప్తంగా

కామాక్షితాయికి విశేషాలంకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయిని స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటి మంగళవారం కావడంతో మహిళలు పాల్గొని కాత్యాయిని వ్రతం చేశారు. తొలుత గణపతిపూజ, కలశపూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం, మహిళలకు పసుపు, కుంకుమ, అమ్మవారి గాజులు అందజేశారు. ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఇన్‌చార్జి వీసీ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో కెమిస్ట్రీ విభాగంలో నాలుగో సెమిస్టర్ చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మంగళవారం అభినందించారు. వీరు ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణి పర్యవేక్షణలో బెంగళూరులోని ఫార్మసీ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేశారు. ఇందులో భాగంగా క్రమటోగ్రాఫిక్ టెక్నిక్స్, పరిశోధనలో కెమికల్స్‌ను ఎలా ఉపయోగించాలో అనే విషయాల పట్ల పరిశోధనాత్మక అధ్యయనం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ఫార్మసీ కంపెనీ రూ.90 వేల నగదు బహుమతి అందజేసి అభినందించారు. ఈ క్రమంలో వీరిని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మంగళవారం అభినందించారు.

మైనింగ్‌ను నిలిపివేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పొదలకూరు : పట్టణానికి సమీపంలో సర్వే నంబర్ 707లో అనుమతి పొంది ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న క్వార్ట్జ్ మైనింగ్‌ను నిలిపివేయాల్సిందిగా ఎమ్మార్పీఎస్ నాయకుడు అలుపూరు పాపయ్య తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మైనింగ్‌కు అతి సమీపంలో వెంకటేశ్వర నగర్‌లో 300 కుటుంబాలు ఉన్నాయని, ఐటీఐ కళాశాల కూడా ఉందన్నారు. అక్కడ అధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీలు జీవాలను మేపుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. మైనింగ్ నిర్వహిస్తే జీవాలకు ప్రమాదమన్నారు. దీనిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

గ్రామాల్లో చిచ్చుపెడుతున్న సోమిరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మనుబోలు : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పచ్చటి గ్రామాల్లో చిచ్చు పెడుతూ నాశనం చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకుడు చెందులూరు శ్రీనివాసులు విమర్శించారు. రూ.40 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తాను ఆక్రమించినట్లు సోమిరెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈ మేరకు కొమ్మలపూడి క్రాస్ రోడ్డు పొలాల వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను ఆక్రమించానని చెబుతున్న భూములకు సంబంధించిన పత్రాలు 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేశారు. టీడీపీ మూకలు దౌర్జన్యంగా తన భూముల్లో చొరబడి షెడ్డు, ఇతర వస్తువులను ధ్వంసం చేయడం దారుణమన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

గాజు సీసాలో ఎడ్లబండిని తోలుతున్న రైతు



బియ్యపుగింజపై దేవుని చిత్రాలు



అగ్గిపెట్టెలో ఇమిడిపోయే 15 రకాల పనిముట్లు



చేయి తిప్పితే కళాకృతులు

చేతి వేలు కూడా వెళ్లలేని గాజు సీసాలో నాగలి పట్టిన రైతు, కల్లుగీత కార్మికుడు, ఎడ్లబండి, కుర్చీ, మంచం.. ఇలా ఒక టేమిటి.. దేన్నయినా తయారు చేస్తాడు మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం గ్రామానికి చెందిన ఆలూరు రాము. బియ్యపు గింజపై దేవుని చిత్రాలు, ఆంగ్ల అక్షరమాల, భారతదేశ చిత్రపటం తదితర బొమ్మలు వేస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నాడు.

- గాజు సీసాల్లో కొయ్యబొమ్మలు
- బియ్యపు గింజపై దేవుని చిత్రాలు
- యాచవరం వడ్రంగి ప్రతిభ

మనుబోలు : వృత్తిరీత్యా వడ్రంగి(కంసాలి) పనిచేస్తూ జీవనం సాగించే రాము.. ఖాళీ సమయాల్లో తనలోని ప్రతిభకు పదును పెట్టే రకరకాల ప్రయోగాలు చేస్తుంటాడు. ఓ రైతు నాగలితో సాగు చేస్తున్నట్లుగా, గీత కార్మికుడు తాటిచెట్టు ఎక్కుతున్నట్లుగా, ఓ రైతు ఎడ్లబండి తోలుతున్నట్లుగా, కుర్చీ, నులక మంచం.. ఇలాంటి కొయ్య బొమ్మలను



చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

మామూలుగా తయారు చేయడమే కష్టం. అలాంటిది చేతి వేలు కూడా పట్టనంత చిన్న మూతి ఉన్న గాజు సీసాల్లోకి వాటి విడి భాగాలను పంపించి ఆకృతులు తయారు చేయడం రాము సొంతం. అలాగే బియ్యపు గింజపై భూతద్దంలో తప్ప మామూలుగా కనిపించని సైజులో ఏ నుంచి జెడ్ వరకు ఇంగ్లిష్ అక్షరాలు



విజయవాడలో రామును సన్మానిస్తున్న విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ సంస్థ వారు (ఫైల్)

పెన్సిల్‌తో రాశాడు. ఇలానే శ్రీరాముడు, సీత, ఆంజనేయుడు, వినాయకుడు, భారతదేశం చిత్రపటాలను ఆవిష్కరించారు. కేవలం మూడు మిల్లీమీటర్ల పొడవు రెండు మిల్లీమీటర్ల వెడల్పుతో పుస్తకాన్ని తయారు చేశారు. ఇల్లు, కత్తి, గొడ్డలి, నాగలి, గడ్డపార, వీణ, డబుల్‌కాట్, సుత్తి, బండి, నులక మంచం, శివలింగం తదితర 15 రకాల వస్తువులన్నీ కలిపి అగ్గిపెట్టెలో ఇమిడిపోయే సైజులో తయారు చేశారు. రాము ప్రతిభను చూసిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆయన తయారు చేసిన పలు కళాకృతులను చూసిన ప్రైవేటు సంస్థల వారు గతంలో ఆయన్ను ఘనంగా సన్మానించిన సందర్భాలు

ప్రోత్సహిస్తే మరిన్ని అద్భుతాలు



మైక్రో ఆర్ట్ గురించి పత్రికల్లో వచ్చే కథనాలు చదివి మనం కూడా ఎందుకు ప్రయత్నించకూడదని ఇలాంటివి మొదలు పెట్టా. నేను తయారు చేసిన బొమ్మలు చూసి చుట్టు పక్కల వారు ఎంతో మెచ్చుకునే వారు. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల వ్యయ ప్రయాసలతో కూడిన మైక్రో ఆర్ట్‌కు ఎక్కువ సమయం కేటాయించలేని పరిస్థితి నాది. ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తే మరిన్ని అద్భుతమై కళాకృతులను తయారు చేస్తా.

– ఆలూరు రాము, సూక్ష్మ కళాకారుడు

న్నాయి. అయితే ఆర్థికంగా స్తోమత లేనందున కుటుంబ పోషణ కోసం తన వృత్తి అయిన వడ్రంగి పనిని కొనసాగించే క్రమంలో వీటికి సమయం కేటాయించలేకపోతున్నాడు. సరైన ప్రోత్సాహం కరువై అతని ప్రతిభ నాలుగు గోడలకే పరిమితమైపోతోంది. ప్రోత్సాహం లభిస్తే రాము మరిన్ని అద్భుతాలు చేస్తాడనడంలో ఎవరికీ సందేహం లేదు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

- జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

ఇందుకూరుపేట : కీటక జనిత వ్యాధులపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ హుస్సేనమ్మ సూచించారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గ్రామాల్లో దోమలను నివారించే ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, దోమతెరలు వినియోగించేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు డెంగీ, మలేరియా సంబంధిత పరీక్షలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఎల్‌ఎల్‌టీ హైమా తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవెంకటేశ్వర'లో పుస్తకావిష్కరణ



కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ షీబా కౌసర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎల్.ప్రసన్న వెన్నుపూస గాయాలపై రచించిన పుస్తకాన్ని కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ కోట గిరీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను నియంత్రించాలి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పొదలకూరు : జిల్లాలో మాతా, శిశు మరణాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశానికి డీఎంహెచ్‌ఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులను 12 వారాల్లోగా గుర్తించి వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందివ్వడం, రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలను అందజేయడం వంటి చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. గర్భిణులు ప్రతినెలా 9వ తేదీన ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమం కింద డాక్టర్ వద్ద పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఉచితంగా స్కానింగ్, రక్త పరీక్షలు, అవసరమైన మాత్రలను అందజేస్తామన్నారు. జిల్లాలో ఎల్‌సీడీసీ సర్వే కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మరో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

వారం రోజులు కార్యక్రమాన్ని పొడిగించినట్లు వివరించారు. ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటికీ వెళ్లి స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి వెంటనే సమాచారం అందజేయాలన్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్‌రిషిత, విస్తరణాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాష్‌పాండ్ గండిపై విచారణ జరపాలి

ముత్తుకూరు : నేలటూరులోని ఏపీజెన్‌కో యాష్‌పాండ్‌కు గండి పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. సంఘ జిల్లా అధ్యక్షుడు పులిగర్ల శ్రీరాములు, ఉపాధ్యక్షుడు ఓడూరి వెంకటకృష్ణయ్య, కార్యదర్శి మూలి వెంగయ్య తదితరులు యాష్‌పాండ్‌కు పడిన గండిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం, నాసిరకం పనుల వల్ల యాష్‌పాండ్‌కు గండి పడిందన్నారు. దీని వల్ల పంట పొలాలు దెబ్బతిన్నాయని, గ్రామాలు కలుషితమయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. నాలుగు రోజులు అయినప్పటికీ గండిని పూడ్చలేదన్నారు. దీని వల్ల నష్టపోయిన రైతులకు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నేతలు

రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రాజెక్టు ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గోడ మలికొండయ్య, చిట్టేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామచంద్రారెడ్డినగర్ వద్ద ముంబై జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్‌ఆర్‌నగర్ కాలనీ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హాస్టల్ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న విద్యార్థినులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బీసీ హాస్టల్‌లో 130 మంది విద్యార్థినులకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీడబ్ల్యూఓ శ్రీదేవి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహారా సంస్థ దుప్పట్లను అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో మరింత చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, వార్డెన్ ఏవీఎస్‌ఆర్ లక్ష్మి, సహారా ప్రతినిధి యస్దాని బాషా తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

మనుబోలు : తల్లిపాలు పడితేనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. తొలుత తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం ఆరు నెలలు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు రొమ్ము కేన్సర్ వంటి రోగాలు రావన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలను తప్పకుండా తాగించాలన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రమణమ్మ, హర్షవీణ, అంగన్‌వాడీలు రాధా, సంపూర్ణ, దొరసానమ్మ, ఉమ, ముత్యాలమ్మ, రమణమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

తల్లిపాలు అమృతంతో సమానం

తోటపల్లిగూడూరు : బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని చిన్నచెరుకూరు పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యంగా పెరగాలంటే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనూరాధ, లావణ్య, భవాని పాల్గొన్నారు.

ఎంతో శ్రేయస్కరం

కొడవలూరు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని సర్పంచ్ ఎన్.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని గౌతమ్‌నగర్‌లో తల్లిపాల ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, మహిళా పోలీస్ తేజస్విని, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రియదర్శిని, ఉమ, మమత, సునీత, మధుసూదనమ్మ, ఎస్తేరమ్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

తలమంచిలో..

మండలంలోని తలమంచిలో తల్లిపాల ఆవశ్యకతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి బాలింత బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మ, కె.హేమలత, టి.సౌజన్య, పి.సుమలత, జి.శిరీష, పి.చండీప్రియ పాల్గొన్నారు.

యల్లాయపాళెంలో..

మండలంలోని యల్లాయపాళెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్జహాన్, శ్రీలత, వెల్ఫేర్ సహాయకుడు మల్లికార్జున, మహిళా పోలీసు మేరీ హెబ్సిబా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరులో..

విడవలూరు : మండలంలోని వావిళ్ల సెక్టార్ పొన్నపూడి, కొత్తూరు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భగా ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ముర్రుపాల ఆవశ్యకత గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శైలజా, అంగన్‌వాడీ టీచర్‌లు ఆదిశేషమ్మ, విజయ, మాధవి, సువార్తమ్మ, ప్రసూన, మంగమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలల్లో వ్యాధి నిరోధక శక్తి

ఇందుకూరుపేట : తల్లిపాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పుట్టిన బిడ్డకు తప్పక ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని గంగపట్నంలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నూరుశాతం అరికట్టాలని చెప్పారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : చిన్నచెరుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో..



విడవలూరు : తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



కొడవలూరు : గౌతమ్‌నగర్‌లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



కొడవలూరు : తలమంచిలో..



కొడవలూరు : యల్లాయపాళెంలో..

కేన్సర్‌పై అవగాహన అవసరం

కొడవలూరు : కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరిలో కనీస అవగాహన అవసరమని అంకాలజిస్ట్ డాక్టర్ తనూజ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆవరణలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి కేన్సర్‌పై మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులువుగా నివారించవచ్చన్నారు. కేన్సర్ అనుమానిత లక్షణాలుంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఏ వెంకట్రావు, ఏఎన్‌ఎం శేషుబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంకాలజిస్ట్ తనూజ